క్లుప్తంగా

స్వేచ్ఛా సమాజాన్ని నిర్మించాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బాలికలపై వివక్షలేని స్వేచ్ఛా సమాజాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు ప్రవాహ ఆర్గనైజేషన్, సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సామాజిక రుగ్మతలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రపంచం ఇంత అభివృద్ధి చెందినప్పటికి బాలికలపై వివక్ష చూపిస్తుండడం తగదని అన్నారు. కళాశాలల్లో, పని ప్రదేశాల్లో మహిళాలపై హత్యాచారాలు వంటివి చోటుచేసుకుంటుండడంతో వారిలో అభద్రతా భావాన్ని కలిగిస్తాయన్నారు. ఇటువంటి ఘటనలు జరగకుండా కఠినికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం విద్యార్థులు పలు నాటికలు, ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, కన్వీనర్ పర్వతాలు, గాలెన్న, మాధురిమోహన్, చంద్రశేఖర్, పీఆర్వో రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని వినతి

భూత్పూర్: చెరువులు, కాల్వలు, కుంటలల్లో మత్స్య సంపదపై తెనుగు, ముత్తరాసి, ముదిరాజ్, బెస్తలకు సర్వ హక్కులు కల్పించాలని నాయకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం భూత్పూర్ తహసీల్దార్ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ ఫరీద్‌కు వినతి పత్రం అందజేశారు. ముదిరాజ్ భవన నిర్మాణాలకు రూ.10కోట్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణ, మల్లేష్, గొడుగు రాజు, గోప్లాపూర్ సత్యనారాయణ, ఆకుల వెంకటయ్య, ఎర్ర బాలప్ప, శ్రీశైలం, గౌరయ్య, ఆంజనేయులు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముందు నిలిపిన కారు టైర్ల అపహరణ



జడ్చర్ల: ఇంటి ముందు నిలిపిన కారు టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన మాచారంలో చోటు చేసుకుంది. బాధితుడు నరేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. సోమవారం రాత్రి నరేందర్ తన ఇంటి ముందు కారును పార్కు చేశాడు. అతడు ఇంటిలో నిద్రపోతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కారు వద్ద రాళ్లు పెట్టి నాలుగు టైర్లు అపహరించుకు వెళ్లారు. మంగళవారం ఉదయం చోరీ జరిగినట్లు గుర్తించిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా స్థానిక తాలుకా క్లబ్ ప్రాంతంలో కూడా ఓ వ్యక్తికి సంబంధించిన కారు టైర్లు, బ్యాటరీ చోరీకి గురైనట్లు సమాచారం.

పండుగలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

మిడ్జిల్: ప్రజలు పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని పోలీసులు సూచించారు. బుధవారం నిర్వహించే మొహర్రం వేడుకలపై జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున గౌడ్ ఆధ్వర్యంలో.. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మిడ్జిల్, వాడ్యాల్, బోయిన్‌పల్లి గ్రామాలకు చెందిన నాయకులు, యువతతో శాంతి సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ అశోక్‌బాబు, నాయకులు అల్వాల్‌రెడ్డి, గౌస్, బంగారు. శ్రీనివాసులు, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ క్రైం: పండుగలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని వన్‌టౌన్ సీఐ అప్పయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. బుధవారం తొలి ఏకాదశి, పీర్ల పండుగ(మొహర్రం)లను ప్రజలు సంతోషంగా, శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఎస్‌ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

చిన్నచింతకుంట: ఎస్‌ఐ ఆర్ శేఖర్ ఆధ్వర్యంలో రికవరీ చేసిన సెల్‌ఫోన్లను పోలీసులు బాధితులకు మంగళవారం అందజేశారు. బండ్రపల్లికి చెందిన బాలకృష్ణ, దమగ్నాపురంనకు చెందిన రామచారి, ఉంధ్యాలకు చెందిన మహేందర్ వేర్వేరు ఘటనల్లో ఇటీవల తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నట్లు వివరించారు. ఈ మేరకు చిన్నచింతకుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసుకుని ఫోన్లను ట్రేస్ చేసి రికవరీ చేశామని వివరించారు. సిబ్బంది బాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పెద్దర్పల్లిలో ఆధార్‌కేంద్రం ఏర్పాటు

హన్వాడ: పెద్దర్పల్లి యూపీఎస్ పాఠశాలలో ఆధార్‌నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించే కేంద్రాన్ని హెచ్‌ఎం రవిశంకర్, బీజేపీ నాయకుడు రఘురాంగౌడ్ తదితరులు మంగళవారం ప్రారంభించారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



చౌలతండా వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు



భూత్పూర్ వద్ద నాగర్‌కర్నూల్ వెళ్లే రహదారిలో..

ప్రమాదకర మలుపులు

భూత్పూర్: పట్టణం నుంచి నాగర్‌కర్నూల్ వెళ్లే దారిలో మలుపు ప్రమాద భరితంగా మారాయి. నిత్యం ఈ రహదారి గుండా రాకపోకలు సాగించే వందలాది వాహనదారులకు అవస్థలు ఎదురవుతున్నాయి. మలుపుల వద్ద చెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కన్పించడం లేదు. దీనికితోడు మలుపుల వద్ద ఎలాంటి సూచికబోర్డుల ఏర్పాటు చేయలేదు. ఈ నేపథ్యంలో తరుచూ ఆయా మలుపుల వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అవతలి వైపు నుంచి అకస్మాత్తుగా.. ఎదురుగా వాహనాలు రావడం గమనించలేకపోతుండడంతో ఘటనలు జరుగుతున్నాయి. వాహనాలు బోల్తాపడి ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని మలుపుల వద్ద సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని.. అవసరమైన చోట్ల చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

కనులపండువగా తొలి ఏకాదశి ఉత్సవాలు

నవాబుపేట: మండల పరిధిలోని కొల్లూర్‌లో తొలి ఏకాదశి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలపురి చిన్నయ్య జీవసమాధి చెంత నందీశ్వర గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఊరేగింపు నిర్వహించారు. వివిధ ప్రాంతాలను భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

జడ్చర్లలో నేడు..

జడ్చర్ల టౌన్: ఆషాడమాసం తొలి ఏకాదశి పురస్కరించుకుని బుధవారం వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పట్టణంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అదేవిధంగా స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో సరస్వతి మాతకు విశేష పూజలతోపాటు శాకంబరి అలంకారం, సామూహిక కుంకుమార్చన ఉంటుందని సేవాసమితి సభ్యులు తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక పీర్ల పండుగ



జిల్లాకేంద్రంలో పీర్లకు ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



కోయిల్‌కొండలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పీర్ల పండుగ మత సామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్, పాతపాలమూరు వద్ద ఏర్పాటు చేసిన పీర్లకు మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి పండుగలు, పర్వదినాలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, స్థానిక నాయకులు జలీల్, అమీర్, ఎల్లంగారి భరత్ తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ఖిల్లాగుట్టపై మొహర్రం సందర్భంగా బీబీ ఫాతిమాను పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఆమె జాతరలో గాజులను, స్వీట్లను కొనుగోలు చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.విద్యాసాగర్, మండల అధ్యక్షుడు జి.రవీందర్, సత్యపాల్‌రెడ్డి, జాఫర్, దస్తగిరి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవం..

వనమహోత్సవంలో యువత పాల్గొని మొక్కలు నాటాలని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీడీఓ కాళప్ప పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం నిలిపివేత

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక రాంనగర్‌లో మున్సిపాలిటీకి చెందిన బందరదొడ్డిని ఆక్రమించి ఇటీవల ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు అక్కడికి వెళ్లి సదరు వ్యక్తికి నోటీసులు ఇచ్చినా ప్రయోజనం దక్కలేదు. చివరకు మంగళవారం ఘటన స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్ రెడ్డి, టీపీఓ లక్ష్మీపతి పరిశీలించి వెంటనే పనులను ఆపివేయించారు. మళ్లీ నిర్మాణ పనులు చేపడితే కూలగొడతామని సదరు వ్యక్తిని హెచ్చరించారు. అనంతరం క్రిస్టియన్‌పల్లిలోని ప్రభుత్వ ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. వాటికి రక్షణగా చుట్టూ జాలీలు (ట్రీగార్డ్స్) ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు నీరు పోసి సంరక్షించాలని సిబ్బందికి సూచించారు. అలాగే తొమ్మిదో వార్డు పరిధిలోని శాంతినగర్‌లో కొనసాగుతున్న పారిశుద్ధ్యం పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణం పరిశీలిస్తున్న అధికారులు

భక్తిశ్రద్ధలతో బోనాల ఊరేగింపు



తీగలపల్లిలో బోనాల ఊరేగింపు

నవాబుపేట: తీగలపల్లిలో మంగళవారం బోనాల వేడుక భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నాయకులు జంగయ్య, నారాయణ, చెన్నప్ప, బీమయ్య, కాశన్న, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

చెన్నాయపల్లిలో..

గండేడ్: చెన్నాయపల్లిలో మంగళవారం బోనాల వేడుక ఘనంగా నిర్వహించారు. పోచమ్మ ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి నైవేద్యాలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా..

భూత్పూర్: పట్టణంలోని బ్రిడ్జి వద్ద ఇంటర్నల్ రోడ్డు వాహన స్టాండ్‌గా మారింది. నిత్యం ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలకు వెళ్లే వారితో పాటు వ్యాపారస్తులు సైతం తమ వాహనాలను ఇక్కడ నిలుపుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే చౌరస్తా మీదుగా వందలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. జిల్లా కేంద్రం, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారు ఇక్కడ వాహనాలు నిలిపి హైదరాబాద్, వనపర్తి, నాగర్‌కర్నూల్, కొత్తకోటకు నిత్యం వెళ్తుంటారు. దీంతో జడ్చర్ల వైపు నుంచి యూటర్న్ తీసుకొని వెళ్లే వాహన దారులకు, పాదచారులకు సైతం సమస్యగా మారుతోంది. బ్రిడ్జి వద్ద రెండు వైపులా జడ్చర్ల, కొత్తకోట వైపు వెళ్లే ఆటోలు సైతం నిలుపుతుండడంతో అవస్థలు పడాల్సివస్తోంది.



విద్యార్థికి చేయూత

స్టేషన్ మహబూబ్‌నగర్: ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న కొకుంట్ల మండలం ముచ్చింతలకు చెందిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి పాలమూరు రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో ఆర్థికంగా చేయూతనందించారు. ఫీజు నిమిత్తం విద్యార్థి తండ్రి బుచ్చిరెడ్డికి మంగళవారం జిల్లా కేంద్రంలో రూ. 25వేల చెక్ అందజేశారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, కోశాధికారి నర్సింహారెడ్డి, ప్రచార కార్యదర్శి సురేందర్‌రెడ్డి, కార్యదర్శి కోటీశ్వర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రుణమాఫీపై హర్షం..

గండేడ్: ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడం హర్షించదగ్గ విషయమని గండేడ్, మహమ్మదాబాద్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, కేఎం నారాయణ పేర్కొన్నారు. ఈనెల 18 నుంచి రుణమాఫీ చేయనున్నారని ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉపాధిహామీ 3వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణయ్య తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన ఉపాధిహామీ పనులపై గ్రామాల్లో తనిఖీలు నిర్వహించిన బృందం వాటి వివరాలను ప్రజావేదికలో వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

ఫొటో ఎక్స్‌పో వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్ర ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో.. ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు జరిగే ఫొటో ఎక్స్‌పోకు సంబంధించిన వాల్‌పోస్టర్లను పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గంజి శ్రీనివాస్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయ ప్రసాద్, రవికుమార్, కోశాధికారి గోపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, సయ్యద్ నుస్రత్, రాఘవులు, నర్సప్ప, సత్యం యాదవ్, కుమ్మరి నర్సింహ, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వనమహోత్సవం

మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వనమహోత్సవం నిర్వహించారు. ఎంపీడీఓ గీతాంజలి మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను రక్షించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి సాయన్న, వైద్యాధికారి శివకాంత్, అనూష, సౌజన్య, శశాంక్, దేవయ్య, జంగయ్య, సంపత్, రాజేశ్వరి, బాలమణి, గీతా, తిరుపతమ్మ, పారిజాత పాల్గొన్నారు.

భూత్పూర్: మద్దిగట్లలో మంగళవారం మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి మొక్కలను పంపిణీ చేశారు. కార్యదర్శి గోపి, గ్రామస్తులు పాల్గొన్నారు.

త్రిడేలీగ్‌లో జిల్లా జట్టు 146 పరుగులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో హెచ్‌సీఏ ఏ–1 డివిజన్ త్రిడే లీగ్‌లో మహబూబ్‌నగర్ వర్సెస్ సాయి సత్య జట్ల మధ్య మంగళవారం మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 45 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 146 పరుగులు చేసింది. జట్టులో అబ్దుల్ రాఫే (46 పరుగులు), కె.శ్రీకాంత్ (37) పరుగులతో నాటౌట్ నిలిచాడు. బుధవారం రెండో రోజు జిల్లా జట్టు బ్యాటింగ్ కొనసాగించనుంది.

టిఫిన్‌సెంటర్‌కు రూ.3వేల జరిమానా

జడ్చర్ల టౌన్: పట్టణంలో 44వ నంబరు జాతీయరహదారిపై ఉన్న సింధూర టిఫిన్ సెంటర్‌కు మున్సిపల్ కమిషనర్ ఎస్. రాజయ్య రూ.3వేల జరిమానా విధించారు. మంగళవారం టిఫిన్ చేసేందుకు హోటల్‌కు వెళ్లిన ఆయనకు సందేహం కలిగి కిచెన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అపరిశుభ్రంగా ఉండటంతో పాటు దుర్వాసన వెదజల్లుతుండటంతో నిర్వాహకుడిని పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుభ్రత పాటించాలని హెచ్చరించారు.

పాఠశాలల్లో సిబ్బందిని నియమించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ పాఠశాలలో వాచ్మన్ కం స్వీపర్, అటెండర్లను నియమించాలని ఎస్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాహేర్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళశారం జెడ్పీ సీఈఓ రాఘవేందర్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. సాధారణ బదిలీల్లో బోధనేతర సిబ్బందికి అవకాశం కల్పించాలని కోరారు. కాగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని సీఈఓ హామీ ఇచ్చారు. రాష్ట్ర కార్యదర్శి శశిధర్, గెజిటెడ్ హెచ్‌ఎం శ్రీనివాస్, జిల్లా పరిషత్ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ మదన్ పాల్గొన్నారు.

నేడు పండుగ సాయన్న విగ్రహ ఆవిష్కరణ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రజల కోసం నిలబడి ఆధిపత్య వర్గాలపై యుద్ధం చేసిన వీరుడు పండుగ సాయన్న అని నాయకులు అన్నారు. హన్వాడ మండల కేంద్రలో బుధవారం సాయన్న విగ్రహం ఆవిష్కరించనున్నారు. సాయన్న విగ్రహ ప్రతిష్టాపన కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఉదయం సాయన్న చిత్రపటానికి నివాళులు అర్పించి అక్కడి నుంచి హన్వాడ మండల కేంద్రం వరకు పెద్ద ఎత్తున ర్యాలీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎంపీలు ఈటెల రాజేందర్, అరుణ, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మాజీ మంత్రి పి. చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, కాంగ్రెస్ నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, సంజీవ్‌ముదిరాజ్, నీలంమధు, నాయకులు జగన్, మోహన్‌రావు, అంబర్‌పేట్ శంకర్, సురేందర్ బాబు, చొప్పరి శంకర్ తదితరులు హాజరుకానున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిటీ నాయకులు

వర్షానికి రెండు ఇళ్లు నేలమట్టం

- టీడీగుట్టలోని కమ్యూనిటీ హాల్‌లో బాధిత కుటుంబాలకు ఆశ్రయం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా కేంద్రంలోని టీడీగుట్ట ప్రాంతంలో మంగళవారం రెండు పాత ఇళ్లు కూలిపోయాయి. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, టీపీఓ లక్ష్మీపతి తదితరులు టీడీగుట్టకు చేరుకొని బాధిత కుటుంబ సభ్యులు పూసలోళ్ల రాములు, లక్ష్మయ్య, నర్సమ్మతో పాటు మరో ఆరుగురిని సమీపంలోని కమ్యూనిటీ హాల్‌కు తరలించి ఆశ్రయం కల్పించారు. రెండు ఇళ్లలో ఒకటి పెంకుటిల్లు కాగా, మరొకటి రేకుల పైకప్పుతో ఉండగా.. ప్రస్తుత వర్షాలకు వాటి గోడలు పూర్తిగా తడిసి కూలిపోయాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి దుప్పట్లు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. అలాగే పట్టణంలో ఎక్కడెక్కడ పాత ఇళ్లు ఉన్నాయో వార్డు ఆఫీసర్లు గుర్తించి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘన్సీరాంనాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాయిబాబా, 33వ వార్డు కౌన్సిలర్ మునీరొద్దీన్ పాల్గొన్నారు.



టీడీగుట్ట ప్రాంతంలో నేలమట్టమైన పాత రేకుల ఇల్లు

అమ్మమాట.. అంగన్‌వాడీ బాట



గోపన్‌పల్లిలో ర్యాలీలో పాల్గొన్న గ్రామపెద్దలు, నాయకులు

దేవరకద్ర: మండల కేంద్రంతోపాటు గోపన్‌పల్లి తదితర గ్రామాల్లో మంగళవారం అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలని ర్యాలీలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు మణెమ్మ, శకుంతల, వినోద, మహేశ్వరి, రాణి, యాదమ్మ, ఉదయకుమారి, గోపన్‌పల్లిలో నాయకులు శ్రీకాంత్ రెడ్డి, రాంబాబు, జ్ఞానేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాకేంద్రంలోని బ్రాహ్మణవాడి, రామయ్యబౌలి ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసీమ్ సుల్తానా, కౌన్సిలర్లు వేద, ముస్తాఫ్ రషీద్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో..

వ్యక్తి అదృశ్యం

జడ్చర్ల: కిష్టారం గ్రామానికి చెందిన శివ(35) కనిపించకుండా పోయాడని అతడి భార్య అనూష పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమవారం జడ్చర్ల కోర్టులో కేసు విచారణకు హాజరయ్యేందుకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన శివ తిరిగిరాలేదని ఆమె వాపోయారు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ రావడంతో వస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. చుట్టుపక్కలా, బంధువుల దగ్గర వాకబు చేసినా ఆచూకీ లభించలేదని తెలిపింది.

లారీ బోల్తా : ఇద్దరికి గాయాలు



శాఖాపూర్ శివారులో బోల్తాపడిన లారీ

అడ్డాకుల: మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై అదుపు తప్పి లారీ బోల్తాపడిన ఘటనలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. హైదరాబాద్ వైపు నుంచి బెంగళూర్‌కు లారీలో బంగాళాదుంపలను తరలిస్తున్నారు. మార్గమధ్యలో కందూర్ స్టేజీ దాటిన తర్వాత శాఖాపూర్ శివారులో చెరువు కట్ట సమీపంలో మంగళవారం ఉదయం సదరు లారీ అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి బోల్తాపడింది. ఘటనలో డ్రైవర్ సంజయ్ కాలుకు గాయమైంది. లారీలో ఉన్న మరో వ్యక్తి రాహుల్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కాగా బంగాళాదుంపలను మరో లారీలో తరలించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.